ప్రజాశక్తి

మంగళవారం 25 మార్చి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం, కౌలు రైతుసంఘాల నాయకులు

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో.?

12 నుంచి అని ప్రకటించినా..నేటికీ ప్రారంభం కాని వైనం 5లో



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన 4లో

నలిగిపోతున్న గ్రామ నాయకులు

- అప్పుడు వైసిపిలో..
- ఇప్పుడు తెలుగుదేశంలో..
- ఎవరికీ ఆర్థిక భరోసా అందక
- చిక్కిశల్యమవుతున్న దైన్యం
- ఎవరికి ఏది వచ్చినా ప్రతిష్టకు
- పోయి ఆస్తులమ్మి సాయాలు..
- అధికారంలోకి వచ్చాక
- దాన్ని చూసుకుంటూ
- ఐదేళ్లు బతుకీడ్చడం..
- ఓట్ల కోసం ఇంటింటికీ
- కాళ్లరిగేలా తిరిగామని
- తెలుగు తమ్ముళ్ల ఆవేదన



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అప్పుడు వైసిపి.. ఇప్పుడు తెలుగు దేశంలో.. గ్రామ నాయకులు నలిగిపోతున్నాడు. ఎవరికి చెప్పుకున్నా అప్పులు తీర్చేవాళ్లు లేరు. కనీసం బాధలు వినేవాడే కరువయ్యాడు. ఎమ్మెల్యేలు.. ఇన్‌ఛార్జులు వచ్చి చెప్పేవాటిని పాత్ర ఏదైనా జెండా మోసేది మొదలు అన్ని ఎజెండాలను ఓటరుకు చేర్చే వరకూ గ్రామ స్థాయి నాయకుడిదే కీలకపాత్ర. ఇప్పుడు ఆ నాయకుడే ఘోషిస్తున్నాడు. తాజాగా ముండ్ల మూరుకు చెందిన మాజీ సర్పంచి, టిడిపి సీనియర్ నేత వెంకట్రావు వీడియో సందేశం చూస్తే పార్టీ నేతలు కళ్లు తెరుస్తారా? లేదా? అనే చర్చ సాగుతోంది. పార్టీ కోసం రేయింబవళ్లూ ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయిస్తే అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకునే వాళ్లే లేరంటూ ఆయన ఆవేదనతో వీడియో పంపారు. గ్రామస్థాయి నాయకుడిని పట్టించుకోకుంటే పార్టీకి పుట్టగతులుండవని హెచ్చరించారు. వాస్తవానికి ఆయన హెచ్చరికలు తన కోసం పార్టీ పెద్దలను బెదిరించడమో లేక తనకు అన్యాయం జరిగిందనో కాదు. గ్రామాల్లో పార్టీ కోసం జీవితాలను పణంగా పెట్టి పనిచేసే వాళ్ల పరిస్థితి ఎలా ఉందో ఆయన తన స్వీయ బాధల్లో నుంచి బయటకు తీసి చెప్పారు. వీటిని పార్టీ అధిష్టానాలు ఏ రకంగా స్వీకరిస్తాయన్నది మరో అంశం. ఆయన సందేశం మాత్రం యాదృశ్చికమా? లేక మరో కోణమా? అనే దాన్ని పక్కనబెడితే గ్రామస్థాయి నేతల పరిస్థితి ఎలా ఉందో కళ్లకు కట్టినట్లు చూపుతోంది. ఇది నూటికి నూరు శాతం వాస్తవం. పార్టీ ఏదైనా ఇదే పరిస్థితి. అందుకు పలానా పార్టీ అనే తేడా కూడా లేదు. గత ప్రభుత్వ హయాంలో చూస్తే వైసిపి గ్రామ నాయకులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. అందుకే ఆఖరులో చేతులెత్తేశారు. డబ్బుతో ఎన్నికలను చేయవచ్చనే గుడ్డి నమ్మకం ఉన్న నేతలందరూ ఓడిపోయారు. కారణం గ్రామస్థాయి నేతలను విస్మరించడమే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాయకత్వం భుజాన వేసుకొని ప్రతిష్టకు పోతారు. గ్రామాల్లో వర్గాలను నడుపుతుంటారు. వారి తరపున ఉన్న పేదలకు ఏ కష్టమొచ్చినా వీళ్లే భరిస్తారు. ఆసుపత్రులకు బిల్లులు కడతారు. ఏ బాధ వచ్చినా వెళ్లి చూస్తారు. నిత్యం సాయాలు ఉంటాయి. పండుగ పబ్బాలకు ఎంతో కొంత ఇస్తుంటారు. గుడిగోపురాలకూ చందాలు వేయాలి. తిరునాళ్లకు సాయాలు తప్పవు. ఇవన్నీ చేయాలంటే 2లో

పొగాకు తగలబెట్టి..నిరసన

- నల్లబర్లీ పొగాకును వెంటనే
- కొనాలని రైతుల డిమాండ్



పొగాకును తగలబెట్టి.. నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి-పంగులూరు

నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని రైతుసంఘం, కౌలు రైతుసంఘం డిమాండ్ చేశాయి. ప్రైవేట్ కంపెనీలు నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోక పోవడానికి నిరసనగా పంగులూరు బస్టాండ్ సెంటర్లో సోమవారం సాయంత్రం రైతులు పొగాకు తగలబెట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ 'నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తాం.. సాగు చేయండి..' అని రైతులను ప్రోత్సహించి సాగు చేయించిన ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు ముఖం చాటేశాయని, కొనుగోలు చేయటానికి ముందుకు రావడం లేదని అన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగు చేసిన రైతులు, కౌలు రైతులు పొగాకు కొనుగోలు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం కూడా పట్టించుకోవటం లేదని విమర్శించారు. గత సంవత్సరం పొగాకు సాగు కొంత ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ సంవత్సరం రైతులు ఎక్కువగా సాగు చేశారని, బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో లక్ష ఎకరాల్లో సాగు చేశారన్నారు. అందులోనూ నల్లబర్లీని ఎక్కువగా సాగు చేశారని చెప్పారు. బర్లీ పొగాకును కూడా బోర్డు పరిధిలోకి తీసుకోవాలని, నల్లబర్లీ పొగాకును రైతులకు గిట్టుబాటయ్యే విధంగా కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయమై ఈ పాటికే కలెక్టర్‌ను కలిశామని, ప్రైవేట్ కంపెనీల యజమానులు కూడా కలిశామని చెప్పారు. వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాయని వినోద్‌బాబు, గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే కదిలి నల్లబర్లీ పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. అంతకుముందు నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని, బర్లీ పొగాకును కూడా బోర్డు పరిధిలోకి తీసుకురావాలని నినాదాలు చేశారు. అనంతరం పొగాకును రైతులు తగలబెట్టారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు తలపనేని సుబ్బారావు, ఆదుం సాహెబ్, మార్పు ఏషియా, కీర్తిపాటి పెద్దోడు, పీరుసాహెబ్, హుస్సేన్, అనిల్, కన్నయ్య, వెంకట్రావు, పుష్పరాజు, సుబ్బారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



బాపట్ల జిల్లా: బర్లీ పొగాకును మద్దతు ధరకు కొని రైతులకు న్యాయం చేయాలని నల్లమడ రైతుసంఘం నేతలు డాక్టర్ కొల్లా రాజమోహన్, కె.విజయకుమార్ సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి వినతిపత్రం అందజేశారు.

భార్యను చంపిన కేసులో..

భర్తకు జీవితఖైదు

- నేరం జరిగిన 9 నెలల లోపే
- నిందితుడికి జైలు శిక్ష..
- ఎస్పీ తుషార్ డూడి వెల్లడి

ప్రజాశక్తి-చినగంజాం, బాపట్ల జిల్లా

మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 జూన్ 6 న జరిగిన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1600 నగదు జరిమానా విధిస్తూ ఒంగోలు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాములు సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. బాపట్ల జిల్లా, చినగంజాం గ్రామంలోని మహాలక్ష్మి కాలనీలో నివాసం ఉండే కత్తి శ్రీనుకు తన భార్య అయిన కత్తి దుర్గతో మనస్పర్ధలు ఉన్నాయి. అందువల్ల ఆమె తన భర్తతో విభేదించి తన పుట్టింటిలో తన తల్లిదండ్రులు, బిడ్డలతో నివసిస్తోంది. ఈ మనస్పర్థల కారణంగా ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లిన కత్తి శ్రీను భార్యతో గొడవ పడి చెట్లు నరికే కత్తితో మెడ మీద, భుజాల మీద కత్తితో దాడి చేశాడు. ఆమె తీవ్ర రక్త గాయాలతో అక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలు దుర్గ తల్లి మల్లవరపు రాఘవమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు చిన్నగంజాం పోలీస్ స్టేషన్‌లో అప్పటి చిన్నగంజాం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. అప్పటి ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తదనంతరం దర్యాప్తు కొనసాగించిన ప్రస్తుత ఇంకొల్లు సీఐ వై.వి.రమణయ్య భౌతిక సాక్ష్యాధారాలను పరిశీలించి నిపుణులు ఇచ్చిన నివేదికను జతచేసి నేరం జరిగిన 6 నెలలలో దర్యాప్తు ముగించారు. సంబంధిత కోర్టులో 2024 సంవత్సరం డిసెంబర్ 27న అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణకు వచ్చిన అనంతరం సరైన సాక్ష్యాధారాలతో నిందితునిపై నేరనిరూపణ చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరుపున వాదించి నిందితుడు కత్తి శ్రీనుకు ఒంగోలు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాములు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1600 నగదు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు, ప్రస్తుత ఇంకొల్లు సీఐ రమణయ్య, చిన్నగంజాం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్.రమేష్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

డ్రగ్స్ నివారిద్దాం.. యువతను కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నిషేధిత మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన కల్పించి యువత భవిష్యత్తును కాపాడాల్సిన అవసరం ఉందని డివైఎఫ్ఐ ప్రకటించింది. సోమవారం నాడు డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలో గాంధీ నగర్ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘ నగర ఉపాధ్యక్షులు తంగిరాలసురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్. బాబు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకొని అన్ని కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'మాదకద్రవ్యాలను నిషేదిద్దాం – అత్యాచారాలను నివారిద్దాం, మహిళలను కాపాడుకుందాం..' నినాదంతో నగరంలోని పలు కాలనీలు, కళాశాలలో ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. యువకులు మాదకద్రవ్యాలకు, దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు ఎస్‌డి.హుస్సేన్, డివైఎఫ్ఐ నగర నాయకులు టి.దాసు, సురేష్, ఆర్.శ్రీను, జబ్బార్, జాన్‌బాషా, మురళీ, మోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కొత్తపట్నం-ప్రజాశక్తి

మండలంలో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలని అన్నారు వ్యవసాయ అధికారి ఓ ప్రకటనలో తెలియజేశారు. శనగలు క్వింటాకి రూ.5,650, మినుములుకు రూ.7,400 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు డ్రోన్ కెమెరా ద్వారా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జరుగుమల్లి ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత సెల్ ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు - ఒంగోలులో విస్తృతంగా తనిఖీలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

బెట్టింగులకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలో పలు ప్రదేశాలలో ఆన్లైన్ బెట్టింగ్ ఆడే వారిని మరియు సింగిల్ నెంబర్ లాటరీ ఆడే వాళ్లను గుర్తించటానికి సోమవారం విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా క్రికెట్ బెట్టింగ్ సంబంధించిన పలు యాప్స్‌ను గుర్తించేందుకు సుమారు 300 మందిని తనిఖీ చేశారు. నలుగురు వ్యక్తుల ఫోన్‌లలో అనుమాన యాప్స్ గుర్తించారు. సింగిల్ నెంబర్ లాటరీ ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.5,500 అమౌంట్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్లు జరుగుతున్న నేపథ్యంలో వీటిని అదునుగా చేసుకొని కొందరు స్వార్ధపరులు, చెడు నడత కలిగిన వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్‌లకు తెరలేపే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్‌లకు బలి అవుతున్నవారిలో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారన్నారు. ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ లు జరిగితే డయల్ 112/100 కు (లేదా) సంబంధిత పోలీస్ అధికారులకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీలలో ఒంగోలు సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, అజయ్ కుమార్, ఎస్సైలు, పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సమష్టి కృషితో క్షయ నివారణ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమష్టి కృషితో క్షయ వ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి సందర్భంగా జిల్లా కుష్టు ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ బెజవాడ శ్రీవాణి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీని డిఎంహెచ్ఒ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రకాశం నుంచి ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వరకు సాగింది. అనంతరం జిజిహెచ్ లెక్చర్ గ్యాలరీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు జిల్లాలో 96 మైక్రోస్కోపీ సెంటర్లు, 33 ఆర్‌టిపిసిఆర్ సెంటర్లు, 2 సిబి న్యాట్ యంత్రాల ద్వారా టిబి లక్షణాలు ఉన్న కేసులను పరీక్షల ద్వారా కనుగొంటున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పిలు నెలకు 10, ఏఎన్‌ఎంలకు 3, ఆశా కార్యకర్తలకు 2 చొప్పున కేసుల లక్షణాలు కనుగొనటం వారిని పరీక్షలకు పంపాలని లక్ష్యంగా నిర్ధేశించామన్నారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.జమున క్షయ రోగులకు వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ వివరించారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ రంజిత్ బాషా క్షయ వ్యాధి ఇన్‌ఫెక్షన్ భారం రేటు, రక్త సంబంధీకులకు వ్యాధి వ్యాప్తించే విధానాన్ని వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాంబశివరావు రోగులు వాడాల్సిన మందులు, దీర్ఘకాలిక చికిత్స(డాట్స్)ను వివరించారు. సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత క్షయ రోగులు తీసుకోవలసిన పోషకాహారాల విశిష్టతను వివరించారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబు మాట్లాడుతూ క్షయ రోగుల బంధువులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్, జిల్లా ఎన్‌విబిపి కోఆర్డినేటర్ డాక్టర్ నళిని, డిఐఒ డాక్టర్ పద్మజ, ఏఆర్‌టి వైద్యులు డాక్టర్ సఖిబ్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ జహంగీర్ సుల్తాన్, అరవింద హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ భానుతేజ, జిల్లా డిపిఎం (ఎయిడ్స్) కిరణ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శింగరాయకొండ: శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ చైతన్య కృష్ణ, డాక్టర్ ధీరేందర్ కుమార్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. సోమవారం కందుకూరు రోడ్డు నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధీరేందర్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరము, బరువు తగ్గినా, దగ్గినప్పుడు రక్తం పడినా క్షయ వ్యాధిగా గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య, టీబీ సూపర్‌వైజర్ షేక్ నిస్సార్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, విజయమ్మ, మహేంద్ర, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నలిగిపోతున్న గ్రామ నాయకులు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల నుంచి ఏమీ రావు. అధికారంలోకి వచ్చాక ఏదో వర్కులు చేసుకొని సంపాదించుకోవచ్చనే భరోసాతో ఉన్న ఆస్తులు, పొలాలమ్మి చేస్తుంటారు. తీరా అధికారంలోకి వచ్చాక ఎంతో కష్టపడి ఒకటీరెండు వర్కులు చేసుకుంటే వాటికి బిల్లులు రావు. ఎక్కడో తెచ్చిపెడితే వాటికి వడ్డీలు కట్టలేక అప్పులపాలు. వైసిపి హయాంలో నేతలు కట్టిన రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాల భవనాలకు బిల్లులు రాక ఎంతో మంది అప్పులపాలయ్యారు. చాలా చోట్ల వాటికి తాళాలు వేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారాక వైసిపి నేతలు పూర్తిగా అప్పుల్లో ఉన్నారు. ఇక తెలుగుదేశం విషయానికి వస్తే 2014–19 మధ్య చేసిన నీరు–చెట్టు పనుల తాలూకు బిల్లులు అప్పుడు సిఎంగా ఉన్న చంద్రబాబూ ఎగనామం పెట్టారు. దీంతో పనులు చేసిన నేతలందరూ దివాళా తీశారు. ఐదేళ్లు వాటి కోసం పార్టీలు మారినవాళ్లు కొందరైతే.. కోర్టులకు వెళ్లి కొందరు తిప్పలు పడ్డారు. అయినా రాలేదు. ఇప్పుడు విడుదల చేయాలని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రకటించారే తప్ప పైసా ఇవ్వలేదంటున్నారు. ఇక ఈ తొమ్మిది నెలల్లో ఏమైనా భరోసా దక్కిందా? అంటే ఎవరికీ చిల్లిగవ్వ రాక అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో పెత్తనం చేసే నాయకులు ఆర్థికంగా దివాళాలో ఉన్నారు. వాస్తవంగా ఊళ్లలో తిరిగి ఓట్లు వేయించేవాళ్లు ఎమ్మెల్యేల వద్ద ఇంటి బయటే ఉంటున్నారు. కార్పొరేట్ కల్చర్‌తో గ్రామాల్లో ఓట్లు లేకపోయినా అలాంటి నేతలు మాత్రం ఎమ్మెల్యేల వద్ద పెత్తనం చేస్తున్నారు. వాళ్లకే వర్కులు ఇస్తున్నారని నిజమైన నేతలు వాపోతున్నారు. గ్రామాల్లోని ఎమ్మెల్యేలు వచ్చినా.. అధికారులు వచ్చినా.. వాళ్లను అన్నీ చూసుకునే గ్రామ నాయకుడు మాత్రం ఇప్పుడు అంపశయ్యపైనే ఉన్నాడు. పార్టీ వీడిపోలేక...గ్రామాల్లో తమను నమ్ముకున్న వారికి దూరంగా ఉండలేక దిక్కుమాలిన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇన్ని పనులు చేసే వీళ్లకు పార్టీ నుంచి ఏమైనా అలవెన్సులు ఉంటాయా? అంటే ఏమీ లేవు. పార్టీ నుంచి మాటలు తప్ప ఆచరణలో ఏమీ ఉండవు. కార్యకర్తలను ఆదుకుంటా మంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్య నేతలు చెప్పే మాటలు అధికారం వచ్చాక ఆచరణలో లేకపోగా కనీసం వారిని కలిసేందుకు కూడా అవకాశం ఇవ్వరు. ఐదేళ్లు అడ్రస్ ఉండరు. టీవీల్లో ముఖ్యమంత్రిగానూ, మంత్రులుగానూ వారిని చూడాల్సిందే.. ఒకరిద్దరు ఎమ్మెల్యేలో లేక మంత్రులో కార్యకర్తలను, గ్రామస్థాయి నేతలను ఆదుకునేందుకు ఎంతోకొంత సొంత నిధులు ఇస్తుంటారు. అయితే తొంబై శాతం మంది గ్రామస్థాయి నేతలకు మాత్రం ఎండమావే ఎదురవుతోంది. పాలక, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికైనా కళ్లు తెరిచి పార్టీ నడకకు అన్నీ తామై ఉండే గ్రామస్థాయి నేతలను ఆదుకునే దిశగా అడుగులు వేయాల్సి ఉంది.

బెట్టింగ్ ముఠాలపై నిఘా

నిందితులపై రౌడీషీట్ తెరుస్తాం

జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరిక

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని రేపల్లె, చీరాల, అద్దంకి మరికొన్ని ప్రాంతాలలో బెట్టింగులకు పాల్పడే అవకాశం ఉన్న ముఠాలపై పోలీస్ నిఘా పెట్టామని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గతంలో క్రికెట్ బెట్టింగ్ కేసులలో అరెస్ట్ అయిన 39 మంది కదలికలు నిశితంగా పరిశీలిస్తున్నామని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై సైతం నిఘా ఉంచామని, యువతను బెట్టింగ్ ఊబిలో లాగడానికి ప్రయతించే వారిని ఉపేక్షించేది లేదని, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడే వారిపై రౌడీ షీట్స్ తెరవడానికి కూడా వెనుకాడబోమని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. బెట్టింగ్ అనేది యువత భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేస్తుంది. దాని వలన కలిగే అనర్థాలు, ఎదురయ్యే ఆర్థికపరమైన సమస్యల గురించి విద్యార్థులకు, యువతకు విస్తత అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారిని, పాల్పడడానికి అవకాశం



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

ఉన్నవారిని గుర్తించి వారు మరల బెట్టింగ్ జోలికి వెళ్లకుండా బైండోవర్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రోజుకొక రకమైన బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వివిధ ఆఫర్స్‌తో బెట్టింగ్ ఫ్రీ అంటూ యువతను ఆకర్షించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఒకసారి ఆడి చూద్దాం అని సరదాగా మొదలుపెట్టి వీటి బారిన పడిన యువకులు బయటికి రావడమనేది కష్టతరమైన విషయమన్నారు. ఈ బెట్టింగ్స్‌కి అలవాటు పడ్డ వాళ్ళు అప్పుల పాలు కావడమే కాకుండా, చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. బెట్టింగ్ ముఠాలు రేపల్లె, చీరాల, అద్దంకి వంటి మరికొన్ని ప్రదేశాలలో వారి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. చీరాల 1 టౌన్‌లో రెండు కేసులలో 11 మంది, రేపల్లె టౌన్‌లో ముగ్గురు, వేమూరు పోలీస్ స్టేషన్ పలో 6 గురు, కొల్లూరు పోలీస్‌లో ఒకరు, చీరాల టూటౌన్‌లో ఒకరు, వేటపాలెంలో 9 మంది, అద్దంకిలో 8 మందిని గతంలో అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడే అవకాశం ఉన్న వారిపై నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్ కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను సిద్ధం చేశామన్నారు.

ప్రజలు సహకరించాలి

క్రికెట్ బెట్టింగ్ లను కట్టడి చేసేందుకు పోలీస్ శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నామని, స్థానిక ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్, క్రికెట్ బెట్టింగ్స్‌లకు పాల్పడినా, వాటిని నిర్వహిస్తున్నా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు లేదా టోల్ ఫ్రీ నెంబర్ లు 100, 112 లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొండపి

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపి మండలంలోని గుర్రపడియ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రపడియ గ్రామానికి మక్కిన బోడియ్య(60) గొర్రెల కాసుకుంటూ జీవిస్తున్నాడు. బోడియ్య గత కొన్ని సంవత్సరాల నుంచి అనార్యోగంతో బాధపడుతున్నాడు. రోజులాగే సోమవారం కూడా బోడియ్య గొర్రెలను తోలుకొని పొలానికి వెళ్లాడు. ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో మనస్తాపానికి గురై సాయంత్రం సమయంలో పురుగు మందు త్రాగి స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెలుతున్న గొర్రెల కాపరి పడిపోయి ఉన్న బోడియ్యను చూచి కుమారుడికి సమాచారం ఇచ్చాడు. వెంటనే బోడియ్య కుమారుడు హుటాహుటిన ఆటోలో కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు వైద్యం అందించిన కాసేపటికి బోడియ్య మృతి చెందాడని తెలిపారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవం

ప్రజాశక్తి-ఇంకొల్లు

భార్యను కిరాతకంగా కత్తితో నరికి చంపిన భర్తకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించిన సంఘటన సోమవారం జరిగింది. ఒంగోలు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్ట్ జడ్జి డి.రాములు ఈ తీర్పును వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. చిన్నగంజాం గ్రామంలో మహాలక్ష్మికాలనీకి చెందిన కత్తి శ్రీను తన భార్యతో మనస్పర్థలు రావడంతో గత ఏడాది జూన్ ఏడవ తేదీన కత్తితో నరికి చంపాడు. ఈ ఘటనపై చిన్నగంజాం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. అప్పటి చిన్నగంజాం ఎస్ఐ శ్రీనివాస రావు కేసు నమోదు చేయగా అప్పటి ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాస రావు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. తదనంతరం ఇంకొల్లు సీఐ రమణయ్య మిగిలిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. పోలీస్ సిబ్బంది సాక్షులను కోర్టులో సమయానుసారం హాజరు పరుస్తూ బాపట్ల జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పటిష్టమైన గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్ధవంతంగా విచారణ చేపట్టారు. సరైన సాక్ష్యాధారాలతో నిందితుడిపై నేరం నిరూపించడంతో సోమవారం జడ్జి డి.రాములు నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,600 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టి సమర్ధవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితుడు శిక్షించబడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాస రావు, ప్రస్తుత సీఐ రమణయ్య, చిన్నగంజాం ఎస్ఐ రమేష్, కోర్టు కానిస్టేబుళ్లు నాగేశ్వర రావులను బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సీడీపీవో సిహెచ్ మల్లేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని ఊళ్లపాలెం హైస్కూల్లో పోషణ భీ పడాయిబిలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీసీవో మాట్లాఉతూ తల్లీ, బిడ్డకు పౌష్టికాహారం అందించాలన్నారు. అదేవిధంగా నాణ్యమైన విద్య మొదటి నుంచి పిల్లలకు నేర్పించాలన్నారు. ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్‌కె.సైదాబీ, జ్యోతి, ఎస్‌కె రిజ్వానా, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరి వారి పాలెం ఉన్నత పాఠశాలలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ విద్య చిన్నారులకు ఎంతో కీలకమైనదన్నారు. చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు.

కొత్తపట్నం: అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పాటు కొత్తపట్నం మండలం అల్లూరు ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను కూడా అందించాలన్నారు. జాతీయ



శింగరాయకొడలో జ్యోతి వెలిగిస్తున్న సీడీపీవో మల్లీశ్వరి

విద్యా విధానం ప్రకారం నాణ్యమైన విద్యలో మెలకువల కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు జరిగే శిక్షణ కార్యక్రమానికి ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రాజకు మారి, సూపర్‌వైజర్ రాణి, ఆదిలక్ష్మి, అనూరాధ, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: మండల పరిధిలోని గుండ్లపల్లి జడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఇవాం జలిన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు మంచి విద్యనందించాలన్నారు. హెచ్‌ఎం, పిఈటి టీచర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపి: కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీడీపీవో మాధవిలత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుత 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల శారీరక అభివద్ధి, మానసిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: అంగన్‌వాడీలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో డివిఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బండ్లమూడి ఉన్నత పాఠశాలలో చీమకుర్తి, రామతీర్థం సెక్టార్లలోని కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పురోభివృద్ధికి, చిన్నారుల, తల్లుల భవిష్యత్తుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఉప్పుటూరు బ్రహ్మయ్య, చీమకుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ ప్రమీల, రామతీర్థం సెక్టార్ సూపర్‌వైజర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని బయటకు తీసుకున్న దృశ్యం

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండలంలోని దూపాడు గ్రామ పరిధిలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివ బసవరాజు తెలిపారు. సోమవారం ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మహిళకు 50 సంవత్సరాలు ఉండొచ్చని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంజనేయరెడ్డికి రిమాండ్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

వైసిపి త్రిపురాంతకం మండల సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరెడ్డి రెండు కేసుల్లో అరెస్టు అయిన నేపథ్యంలో సోమవారం ఉదయం యర్రగొండపాలెం పోలీసులు మార్కాపురం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆయనకు వచ్చే నెల 4వ తేదీ వరకు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆంజనేయరెడ్డిని ఒంగోలులోని సబ్ జైలుకు తరలించారు.

డాక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం అనుములవీడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.భానుప్రకాష్ కుమార్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రాచర్ల పోలీసు స్టేషను ఏఎస్ఐ ఆది శేషయ్య తెలిపారు. అనుమలవీడు గ్రామానికి చెందిన యామ సంజయ్ (ఆర్టీఐ యాక్టివిస్ట్) శనివారం వైద్యశాలకు వెళ్లగా ఆసుపత్రి విధుల్లో ఉండాల్సిన వైద్యులు ఒక్కరు కూడా లేకపోవడంతో తన చరవాణిలో ఫోటోలు తీసుకొని వచ్చారు. ఈ విషయాన్ని అక్కడ ఉన్న వైద్య సిబ్బంది డాక్టర్ భాను ప్రకాష్ రెడ్డికి చెప్పగా ఆయన యామ సంజయ్‌ని దుర్భాషలాడారని యామా సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టరు భానుప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.



రైతులను సన్మానిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

ప్రజాశక్తి-కొండపి

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని మండల వ్యవసాయ అధికారి డి.విజయ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు సాధికారిక సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన, వెలుగు సిబ్బందులతో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఎంటీ ఎస్తేరు మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయ గ్రామాల్లో రైతులు తమ పొలంలో నవధాన్యాలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. అభ్యుదయ రైతులను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, ఏపీసీఎంఎఫ్ ప్రాజెక్ట్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారిని ఝాన్సీ, వ్యవసాయ శాఖ ఏఈఓ కుమార్, యూనిట్ ఇంచార్జిలు రంజిత్, మందాకిని, మాధవ ఐసిఆర్పిలు మాలకొండయ్య, జోత్స్న, నాగరాజు, విఏఏలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

బాధితులకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని పలువురు బాధితులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరామర్శించారు. తొలుత మండల పరిధిలోని కొండ మంజులూరు గ్రామంలో నిర్వహించిన చిలుకూరి రంగయ్య దశదిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని రంగయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముప్పవరం గ్రామంలో ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడిన చింతల లక్ష్మమ్మ ,వలపర్ల భారతి, పాలపర్తి సుభాషిణి పరామర్శించారు. ఇదే ప్రమాదంలో మృతి చెందిన అషిన్‌బి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోరం గ్రామానికి చెందిన వినుకొండ భాస్కరరావు ఇటీవల గుండె సమస్యతో మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. మంత్రి రవికుమార్ వెంట టిడిపి నాయకులు చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు, గరిమిడి జగన్మోహన్‌రావు, పాల డెయిరీ మాజీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, మాజీ జడ్‌పిటిసి కరి వెంకటసుబ్బారావు, నాయకులు జాగర్లమూడి భాను ప్రకాష్, అల్లం లేని బ్రహ్మానంద స్వామి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సబ్సిడీ రుణాల చెక్కు అందజేత

ప్రజాశక్తి- చీరాల

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు చీరాల ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పిఎం అజయ్ పథకం ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాల చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పిఎం అజయ్ పథకం ద్వారా 12 మంది సభ్యులకు రూ.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కె.మధుసూదన్ రావు, డిఆర్‌డిఎ, వెలుగు బాపట్ల క్లస్టర్ కోఆర్డినేటర్ సుబ్బారావు, ఉన్నతి అధికారి ఫణి, చీరాల ఎపిఎం కడెం మధు సూదన్‌రావు, వేటపాలెం ఎపిఎం కాటి అంజిబాబు, సిసిలు, విఎఎలు , పాల్గొన్నారు.

26న పర్చూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పర్చూరు లోని మారుతీ ఐటిఐ కళాశాలలో ఈనెల 26న గోదావరి ఆంధ్ర కోపరేటివ్ సొసైటీ, ఎన్‌ఎస్–ఎల్ టెక్స్‌టైల్స్ వారి సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి పి. ప్రణయ్ సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో గోదావరి ఆంధ్ర కోపరేటివ్ సొసైటీ, ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్స్,ఇండో సోలార్ కంపెనీల ప్రతినిధులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి విద్యార్హతను బట్టి సుమారు రూ.12 వేల నుంచి రూ.15 వేల జీతం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈజాబ్ మేళాకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ. డిగ్రీ, డిప్లొమా చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు జిరాక్స్,ఆధార్ నకలు మరియు పాస్ పోర్ట్ ఫొటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చునని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. కేవలం లబ్ధిదారుల జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. ఆ జాబితా కాగితాలకే పరిమితం అయినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణమోహన్ హయాంలో మున్సిపల్ పరిధిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాల స్లిప్పులు ఇచ్చినట్లు తెలిపారు. పొజిషన్ చూపడలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే పట్టణ వాసులకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత ప్రజలు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న నేటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. అనంతరం తహశీల్దారు గోపికృష్ణకు ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని మహిళలు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వసంతరావు ఎల్.జయరాజు , ఐవి.ప్రసాద్, గోసాల సుధాకర్, పి.కాలేషా, కోటేశ్వరమ్మ, లక్ష్మి, ఏసుపాదం, పవన్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాంబయ్య తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



చీరాలలో మాట్లాడుతున్న బాబూరావు



భట్టిప్రోలులో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు


రేపల్లె : జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ కె.సాంబశివరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో సిమెంట్ రోడ్లు,డ్రైనేజీలు లేవని తెలిపారు. వీధిదీపాలు కూడా సక్రమంగా వెలగడం లేదని తెలిపారు. 21వ వార్డు పరిధిలో డ్వాక్రా గ్రూపులలో అవినీతికి పాల్పడిన మెప్మా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు శ్రీనివాసరావును కలిసి జగనన్న కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కెవి. లక్ష్మణరావు, కె.అశ్వీరాధం,డి.అగస్టీన్, కె.రమేష్,వై.నవీన్, జె.ధర్మరాజు, డి. శ్రీనివాసరావు, కె.నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : అద్దంకి మండలం సింగరకొండపాలెం గిరిజన కాలనీకి చెందిన గిరిజనులకు ఇంటి నివేశ స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ గ్రీవెన్స్‌లో సిపిఎం నాయకులు నాయకులు తహశీల్దారు జి.శ్రీచరణ్, ఎంపిడిఒ సింగయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ సింగరకొండ పాలెం లో గిరిజనకాలనీ వాసులు గత 15 సంవత్సరాల కాలం నుంచి అద్దంకి కొండ మరియు సింగరకొండ దిగువ ప్రాంతాల్లో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇంత వరకూ వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమరగిరి హనుమంతరావు, లక్ష్మీదేవి, లక్ష్మీ, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్ మండల కార్యదర్శి వేములపల్లి వెంకట రామయ్య కొల్లూరు మండల సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపిడిఒ ఎస్.వెంకటరమణకు సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి. కష్ణమోహన్ మాట్లాడుతూ భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని విఠలేశ్వర్ నగర్, కొత్త కాలనీ, అద్దేపల్లి దళితవాడలో రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు సమస్యలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఐలవరంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. వెల్లటూరు పంచాయతీ పరిధిలో 250 కుటుంబాలు ఉన్న కాలనీకి ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెం, కోళ్లపాలెం పెదపాలెం గ్రామాలకు శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, భట్టిప్రోలు నుంచి అక్కివారిపాలెం మీదుగా పెదపులివర్రు వరకు వెళ్లే రహదారిని అభివద్ధి పరచాలని, ఉపాధి హామీ పథకం పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి. సుధాకర్, మండల కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, జి. నాగరాజు, సత్యనారాయణ, పి. మనోజ్ పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాతలు మారడం లేదని సిపిఎం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు విమర్శించారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దారుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం హనుమంతరావు సోమవారం మీడియాతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రక్కన గత 20 సంవత్సరాల క్రితం గిరిజనులకు రామ్ జనార్ధన్ కాలనీ పేరుతో నివేశన స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ పట్టాలు మంజూరు చేయయలేదని తెలిపారు. తక్షణమే గిరిజనులకు పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహశీల్దారు మాట్లాడుతూ ఇంటి స్థల పట్టాల మంజూరుపై విచారణ జరిపించి జిల్లా కలెక్టర్‌కి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మార్టూరు శాఖ కార్యదర్శి ఎనికపాటి రాంబాబు, నక్క చినఅంజయ్య, కె. రామంజి, అంజమ్మ, వీరాంజి, కోటేశ్వరమ్మ, స్థానికులు పాల్గొన్నారు



మార్టూరులో వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు



రేపల్లెలో వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు



అద్దంకిలో మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-చిన్నగంజాం,వేటపాలెం

'పేదల సేవ' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 1న చిన్నగంజాం మండలం పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెం గ్రామానికి రానున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ప్రకాష్ జైన్ తో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి చూశారు. పెన్షను లబ్ధిదారుల వివరాలు సేకరించారు. గ్రామమంతా తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో నిర్వహించనున్న ముఖాముఖి సభా స్థలాన్ని పరిశీలించారు. కార్యకర్తల ముఖాముఖి సభా వేదిక, అధికారులతో సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ వద్ద గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ వచ్చేనెల 1న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సిఎం పాల్గొని గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు. చంద్రబాబు పర్యటనను పండుగలా నిర్వహించాలన్నారు. సిఎం చంద్రబాబుకు అపూర్వ స్వాగతం పలకాలన్నారు. చంద్రబాబు రాక గ్రామ రూపు రేఖలు మారుతాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని వివరించారు. సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు, గహ,అగ్రికల్చర్ విద్యుత్ కనెక్షన్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. వారం రోజులపాటు అధికార యంత్రాంగం ఇక్కడే ఉండి ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. సిఎం పర్యటన విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దష్టిసారించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో చీరాల, బాపట్ల ఆర్‌డిఒలు చంద్రశేఖర్ గ్లోరియా, డిఎస్‌పిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో..?

- 12 నుంచి అని ప్రకటించినా నేటికీ ప్రారంభం కాని కొనుగోళ్లు
- రోడ్లపైనే ధాన్యం రాశులను ఆరబోసిన వైనం
- మారిన వాతావరణంతో అన్నదాతల ఆందోళన
- ప్రైవేటు వ్యక్తులకు అమ్మి నష్టపోతున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కొనుగోలు కేంద్రాలు ద్వారా మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేసి ప్రతిరైతును ఆదుకుంటామని చెప్పి హామీలిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. ఫలితంగా రైతులు ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే తెగ నమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆరుగాలం కష్టించి.. పండించిన పంటకు మద్దతు ధర లేక అన్నదాత నష్టపోతున్నాడు. పంట అంతా నూర్పిడి జరిగి ఇళ్లకు చేరింది. ఇళ్లలో దాచుకొలేక రోడ్లపైన ఖాళీ ప్రదేశాల్లో ఆరబోశారు.

20 రోజులుగా రోడ్లపైనే ధాన్యం

మండలంలోని మెట్టువారిపాలెంలో 12వ తేదీ నుంచి రూ.1,740 మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పారు. కొనుగోలులో సివిల్ సప్లయి అధికారులు మిల్లర్లకు అనుకూలంగా బస్తాకు ఏడు కేజీలు తారం తీసే విధంగా షరతులు విధించారు. దానికి కూడా రైతులు అంగీకరించారు. కానీ ఇంతవరకు మెట్టువారిపాలెంలో కొనుగోలు ప్రారంభించలేదు. దీంతో 20 రోజుల నుంచి ధాన్యం రోడ్లపైన ఆరబోశారు. మారిన వాతావరణంతో ఎప్పుడు వర్షం పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దీన్ని ఆసరా చేసుకొని ప్రైవేటు వ్యాపారులు బస్తా రూ.1200 కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు భారాగా నష్టపోతున్నారు. ఎకరానికి రూ.40 వేల దాకా పెట్టుబడి పెట్టారు. దిగుబడులు చూస్తే 15 నుంచి 20 బస్తాలు మించి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సంఘం నాయకుల సందర్శన

ఈ నేపథ్యంలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు సోమవారం సందర్శించి రైతుల కష్టాలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్కె.మాబు మాట్లాడుతూ మెట్టువారి పాలెం రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలు అనేక షరతులతో 12 నుంచి ప్రారంభిస్తామని షెడ్యూల్ ఇచ్చినా అధికారులు నేటికీ కొనుగోలు ప్రారంభించలేదన్నారు. 20 రోజులుగా రోడ్లపైనే ధాన్యం ఆరబోశారని, వర్షం పడితే పంట అంతా నీటి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే అన్నదాతలను అగౌరవపరిచే విధంగా ప్రభుత్వం, అధికారులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఏరైతును పలకరించినా కన్నీరే కనబడుతుందన్నారు.

రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు మాట్లాడుతూ మెట్టువారిపాలెంలోనే ఎప్పుడూ లేని విధంగా బస్తాకు ఏడు కేజీల తారంతో సివిల్ సప్లయి అధికారులు చెప్పిన షరతులకు అంగీకరించినప్పటికీ కొనుగోలు చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ అనే పేరుతో పంట చేతికి వచ్చినప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని కారణంగా రైతులు ప్రతి ఏడాది తీవ్రంగా నష్టపోతున్నారన్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించి మెట్టువారిపాలెంలో పల్లపు ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి నష్టపోకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వీరివెంట కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్, రైతులు, తదితరులు ఉన్నారు.

10 బస్తాలకు మించి దిగుబడులు రాలేదు

- ఈదర సాంబశివరావు, నీటిసంఘం మాజీఅధ్యక్షులు



పది ఎకరాలు సాగు చేసా. మంచి ఫలితాలు వస్తాయని ఆశించా. కానీ దిగుబడి ఎకరానికి 10 బస్తాలకు మించి రాలేదు. దీనికి తోడు ధరలు తగ్గడంతో నష్టాలు తప్పడం లేదు.

తీవ్ర నష్టాలు తప్పడం లేదు

- కాద్ర శ్రీనివాసరావు, మెట్టువారిపాలెం



నేను 11 ఎకరాలు కౌలు తీసుకొని సాగు చేశాను. మంచి దిగుబడులు వస్తాయని 1262 రకం వేశాను. ఎకరానికి రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. దిగుబడి 20 బస్తాలకు మించలేదు. దాంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాను.

కౌలు కూడా రాని పరిస్థితి

-నున్నా కోటేశ్వరరావు



నేను 25 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాను. మంచి ఫలితాలు వస్తాయని ఆశించా. కానీ 15 బస్తాలు మించి దిగుబడి రాలేదు. దీంతో కౌలు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి

పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.280 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెం గ్రామానికి చెందిన రైతులు 297 బేళ్లను వేలానికి తీసుకు రాగా 239 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 58 బేళ్లను తిరస్కరించారు. కేజీ సరాసరి రూ.275.50 పలుకగా, అత్యల్పధర రూ.260 పలికింది. వేలంలో 10 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్

కొండపి: పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ.271.56 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. గుర్రప్పడియ, చతుకుపాడు, కె.అగ్రహారం, రామచంద్రాపురం, నరసింగోలు గ్రామాలకు చెందిన రైతులు 423 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. అందులో 379 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 44 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.250 పలికిందన్నారు. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎల్లయ్య సేవలు మరువలేనివి

నివాళులర్పించిన జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-చీమకుర్తి

సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దివంగత వేమా ఎల్లయ్య సేవలు మరువలేనివని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం వేమా ఎల్లయ్య 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం సెంటర్లోని ఎల్లయ్య స్మారక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.జవహర్ అధ్యక్షత వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వేమా ఎల్లయ్య శాసనసభ్యునిగా సంతనూతలపాడు నియోజకవర్గానికి, చీమకుర్తి మండలానికి ఎనలేని సేవలు అందించాలని కొనియాడారు. ఆయన హయాంలో చీమకుర్తి మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాల, ఇళ్ల స్థలాల పంపిణీ, రెవెన్యూ కార్యాలయాలు ఏర్పాటు, పశుక్షేత్రం ఏర్పాటు, భూముల పంపిణీ, కాలనీలు ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. వేమా ఎల్లయ్య స్ఫూర్తితో ముందుకు వెళుతున్న జడ్పిటిసి వేమా శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా వేమా ఎల్లయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కె.వి పాలెం ప్రభుత్వ పాఠశాలలో సౌండ్ సిస్టం, స్టడీ మెటీరియల్ అందజేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేశారు. మండలంలోని వేమా ఎల్లయ్య నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. పాఠశాలకు బీరువాను బహూకరించారు. స్థానిక వేమా ఎల్లయ్య స్మారక భవనంలో అంబేద్కర్ స్కిల్ హబ్ డెమో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాలలో వైసీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ దుంప రమణమ్మ, వైసీపీ జిల్లా నాయకులు మన్నం శ్రీధర్, క్రిష్టిపాటి శేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు, కౌన్సిలర్లు తప్పెట బాబురావు, పి.గంగయ్య, సోమా శేషాద్రి, టి.గాంధీ, సుందర్ రామిరెడ్డి, దుంప చెంచిరెడ్డి, గోపురపు చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎల్లయ్యకు నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డి




భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

భగత్‌సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూసపాటి వెంకట్రావు

ప్రజాశక్తి-చీమకుర్తి

భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూసపాటి వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు శీలం ఆదినారాయణ అధ్యక్షత వహించారు. పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు స్వాతంత్రం కోసం పోరాటం చేసి ఉరికంభం ఎక్కారని పేర్కొన్నారు. నేటి పాలకులు దేశాన్ని విదేశీయులకు తాకట్టు పెట్టే విధానాలను అమలు చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రత్యామ్నాయల కోసం యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, టి.రామారావు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, బి.ఓబులేసు, సిహెచ్ కొండయ్య, ఎన్.శ్రీను, టి.తిరుపతిరావు, శంకర్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

గ్రంధి వెంకటేశ్వరరావుకు ఘన నివాళి

రక్తదానం చేసిన కార్మికులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జివిఆర్ సంస్థల అధినేత గ్రంధి వెంకటేశ్వరరావు 85వ జయంతి సందర్భంగా సోమవారం శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండలోని సాగర్ గ్రంధి ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా గ్రంధి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఫ్యాక్టరీ మేనేజర్ బివియన్ శ్రీనివాసరావు ప్రారంభించారు. 60 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంధి వెంకటేశ్వరరావు జివిఆర్ సంస్థను ఏర్పాటు చేసి ఎంతోమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు అన్నారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి సందర్భంగా ఫ్యాక్టరీలో కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరెతోటి బాబూరావు, శంకర్, చెల్లాదొరై, దేవినేని బాలాజీ, పి.శ్రీను, ప్రసాద్, డాక్టర్ బి.బ్రహ్మయ్య ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చైతన్యకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ మసూద్ అలీ, షేక్ సంధాని భాష, కూనప రెడ్డి వెంకట సుబ్బారావు, కుర్ర సుబ్బారావు, షేక్ యస్దాని తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్షయపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎస్పీ బాలయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా జాగ్రత్తలు అవసరమని తెలిపారు. పోషకాహారం విధిగా తీసుకోవాలని తెలిపారు. క్షయ వ్యాధి గ్రస్తులకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రతాపరెడ్డి, పిహెచ్ఎన్ శైలజ, సిహెచ్ఒ మస్తానమ్మ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యదర్శి ప్రసాద్‌కు సంతాపం తెలియజేస్తున్న కార్యదర్శులు

కార్యదర్శి ప్రసాద్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని పెదారికట్ల పంచాయతీ కార్యదర్శి పొదిలి ప్రసాద్ అకాల మృతికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొనకనమిట్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ పంచాయితీల్లో కార్యదర్శిగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని, ఆయన సేవలను కొనియాడారు. తొలుత ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శులు ఎం నరసింహారావు, పిచ్చయ్యబాబు, వి బ్రహ్మనాయుడు, జి బాబు, కాశింవలి, ఉదయభాస్కర్, సుగంధర్ పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

మండలం గణేశ్వరపురంకు చెందిన పి రామయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక శిరిడి సాయిబాబా వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బన్ రొట్టెలు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆయన కుమారులు పి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1,07,411

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.1,07,411 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు సోమవారం తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా రూ.47,140, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.29,895, అన్నదానంనకు విరాళం ద్వారా రూ.19360, ఇతర విరాళాల ద్వారా రూ.11,016 వచ్చినట్లు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



మద్దతు ధరపై అవగాహన కలిగిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

ప్రజాశక్తి-సిఎస్.పురం

రైతులు దళారులను నమ్మి మద్దతు ధర కంటే తక్కువ అమ్ముకోవద్దని వ్యవసాయ అధికారి బి సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని నల్లమడుగుల గ్రామంలో కంది సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కంది పంట నూర్పిడి దశలో ఉందని, ప్రభుత్వం కంది పంటకు క్వింటా రూ.7550 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. పెద్దగోగులపల్లి గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో కందులు కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏపీ మార్క్ఫెడ్ కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కందులు కొనుగోలు చేసిన నాలుగు రోజుల్లో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. కందులు మద్దతు ధరకు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా పంట నమోదై ఉండాలని అన్నారు. పంట నమోదైన రైతులు రైతు సేవా కేంద్రంలో మద్దతు ధరకు అమ్ముకొనుటకు సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఇఒ పి శ్రీనివాసులు, విఎఎ విజయ్ పాల్గొన్నారు.

పీసీపల్లి : మండల కేంద్రమైన పీసీపల్లిలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని పిఎసిఎస్ అధికారులు తెలిపారు. పెద్ద అలవలపాడుకు చెందిన నాగోతు శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రంలో కందులు అమ్ముకోవాలని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. దళారుల మాటలు నమ్మి మోసపోకుండా రైతులంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అమ్ముకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పిసిపల్లి ప్రాథమిక సహకార సంఘం ఉద్యోగులు భాష, పాచ్చు, మలినేని శ్రీనివాసులు, టిడిపి నాయకులు రామయ్య, వీరపనేని పెద్దన్న, నాగోతు మాల కొండయ్య, నాగేంద్రబాబు, మూలే సత్యంరెడ్డి, ఎబినేజర్, ములకా నాగేశ్వరరావు, మాచర్ల పాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

రైతులు భూసార పరీక్షలు చేయించాలి

ప్రజాశక్తి-దర్శి

ఎరువులు వాడే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకొని మోతాదును బట్టి ఎరువులు వాడాలని ఎడిఎ బాలాజీ నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాల్లో రైతులు విఎఎలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఏ ఎరువులు వాడాలో తెలుసుకొని ఆ ఎరువులు వాడాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు. పంటల్లో సస్యరక్షణ, పురుగు మందులు తగ్గించు కోవాలని అన్నారు. ఎరువులు తగ్గించుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో విఏలు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - కనిగిరి

ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ శాఖ, వెలుగు సంస్థల సమన్వయ సమావేశం స్థానిక వె లుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి ఎపి సిఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ విజయరాణి వివరించారు.. పిఎండిఎస్ ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్ వేసవి కాలంలో భూమిని ఎండ పెట్టకుండా 20 రకాల విత్తనాలు 10 కేజీలను భూమిలో వేయటం వలన వచ్చే లాభల గురించి ఎడిఎ ఎగ్గోని వెంకట రమణ వివరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆకర్షితు లయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎపిఎంలు, సిసిలు, విఎఎలు, విఒఎలు అందరూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలు చేసేందుకు పూర్తి సహకారాలు అందిస్తామని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను వ్యవసాయ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి రైతులు విక్రయించారు. కార్యక్రమంలో ఎఒ జ్యోస్నాదేవి, ఎటిఎం అశోక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్ళూరు : వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున మహిళా సంఘాల సమన్వయంతో చేపట్టాలని కోరారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని గ్రామంలోని రైతులందరు ప్రకృతి సాగుపై అవగాహన కల్గి ఉండేలా వ్యవసాయశాఖ, ప్రకృతి సాగు సిబ్బంది, వెలుగు గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం పి దేవదాజ్, సిసిలు మోహన్, సుచంద్ర, ప్రకృతి సాగు టిఎ ప్రభాకర్, ఇన్‌చార్జి పి నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాళ్లూరు ఎఒ బి ప్రసాద్‌రావు



రికార్డులను పరిశీలిస్తున్న సిఐ భీమానాయక్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామూరు సిఐ భీమా నాయక్ తెలిపారు, స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించే విధంగా పని చేయాలని సూచించారు. బయటికి వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఇంటికి తాళాలు వేసుకోవాలని సూచించారు. ఎవరైనా బయట ప్రయాణాలకు వెళ్ళినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సిఎస్.పురం టౌన్‌లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-తాళ్ళూరు

పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎంఇఒ జి సుబ్బయ్య అధ్యక్షతన ఉపాధ్యాయులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు దృశ్య ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎల్ సుధాకర్ పాల్గొన్నారు.

16 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 16 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఎస్పీ బాలయ్య సోమవారం తెలిపారు. మండలంతో పాటు పొదిలి, మర్రిపూడి, కనిగిరి, దొనకొండ, మార్కాపురం, హెచ్ఎంపాడు మండలాల నుంచి ఇక్కడకు వచ్చి ఆపరేషన్లు చేయించుకోనున్నట్లు తెలిపారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతే కాకుండా ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన నగదును బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. వీరితోపాటు మహిళా వైద్యాధికారి డాక్టర్ కె సురేఖ, వైద్య సిబ్బంది ఉన్నారు.

గంగమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

పట్టణంలో కొలువైన గంగమ్మ దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గంగమ్మ తల్లిని పట్టు వస్త్రాలు, పూల మాలలతో అలంకరించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మేకల శ్రీనివాసులు, వైసిపి టీయుసి జిల్లా అధ్యక్షులు మితికేల గురవయ్య, మాజీ షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షులు చల్లా రాఘవులు, ఇండ్ల బాలయ్య, నన్నసాని గుంటయ్య, నన్నసాని యాయాద్రి పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అద్దంకి

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ మనోజ్ ర్యాలీ ప్రారంభించారు.అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న, ఆకలి లేకపోవుట, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోదేపల్లి వైద్యులు డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ జయ సింహ, డాక్టర్ మాధురి డాక్టర్ హరికష్ణ, ఆరోగ్య విస్తరణా ధికారి నాగేశ్వరరావు, జానీ, కన్యాకుమారి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్. విజయమ్మ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీఇని జిల్లా వైద్య ఆరోగ్యఅధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. క్షయ వ్యాధి నివారణ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, ఎన్టిఇపి సిబ్బంది, ఎన్‌జిఒ సుశీల, పిఎస్‌కె నర్సింగ్ కళాశాల విద్యార్థులు, మున్సిపల్ హై స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ శివ చెన్నయ్య తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివచెన్నయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. . ఈ కార్యక్రమంలో పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ హరిబాబు, బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ పద్మావతి, ఎఎన్ఎం శేషకుమారి, హాస్టల్ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



బాపట్ల మానవహారం చేపట్టిన వైద్యసిబ్బంది, విద్యార్థులు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- బాపట్ల : వేసవిలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ,జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ ,పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు ,మందపాటి ఆంధ్రేయ , ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బత్తుల సురేష్ , కోశాధికారి ఆంజనేయులు,ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-చెరుకుపల్లి : వికలాంగుల ఉపకరణాల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. మండలపరిధిలో ఉపకారణాలు అవసరమైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఉపకరణాలు కావాల్సిన వికలాంగులు తమ గ్రామంలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలిసి ఈనెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రైసైకిల్, వీల్ చైర్, చంక కర్ర, బ్రైలీ పలక ,అంధుల చేతి కర్ర మరియు వినికిడి యంత్రాలు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి- చెరుకుపల్లి : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం గణిత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 43 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ పులి లాజర్ తెలిపారు. కావూరు ప్రభుత్వ పాఠశాల, చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గూడవల్లిలోని వనజాల చంద్ర పబ్లిక్ స్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను డిఇఒ పురుషోత్తం, డిప్యూటీ డిఇఒ నవీన్ కుమార్ తనిఖీ చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు : మండల పరిధిలోని ఏల్చూరు గ్రామంలో నున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 6,7, 8,9,10,12 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె. శ్రీలక్ష్మి తెలిపారు. అనాథ పిల్లలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్‌సి,ఎస్‌టి, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని ప్రిన్సిపల్ తెలిపారు.

ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - పంగులూరు : రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దారు సింగారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించు కోవాలన్నారు. ఇకెవైపి పెండింగ్ జాబితాలు ఆయా డీలర్ షాపులు, వద్ద సచివాలయాల వద్ద ఉన్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ తమ లాగిన్‌లో ఇకెవైసి చేయాలన్నారు. ప్రతి డీలరు 50 కార్డులకు తక్కువ కాకుండా బయోమెట్రిక్ చేయించాలన్నారు. కార్డుదారుడు చనిపోయినా, వేరే వీధిలో ఉన్న రిమార్క్ రాయలన్నారు. చిన్నపిల్లలకు ఆధార్ లింక్ చేయించి బయోమెట్రిక్ వేయించాలన్నారు.

సబ్‌జైలులో తనిఖీ

ప్రజాశక్తి -రేపల్లె : రేపల్లె సబ్ జైలును ఉమ్మడి గుంటూరు జిల్లాల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి. పార్థసారథి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్‌జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు. భోజన వసతులు, ఇతర విషయాలు, ఉచిత న్యాయం గురించి అడిగి తెలు సుకున్నారు. సబ్ జైల్‌లోని బ్యారక్‌లు, సిసి కెమెరాలు, సబ్ జైలు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్ స్థానిక ప్యానెల్ న్యాయవాది జి.కుమార్ బాబు. సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కోర్టు, సబ్ జైల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో 'మన వార్డు మన ఎమ్మెల్యే'

ప్రజాశక్తి - బాపట్ల : క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి వాటి పరిష్కరిం చేందుకు మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. పట్టణంలోని ఐదో వార్డులో నరేంద్ర వర్మ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులోని పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దష్టికి తెచ్చారు. నీటి కుళాయి లేక ఇబ్బంది పడుతున్న ఓ మహిళకు మున్సిపల్ నీటి కుళాయి కనెక్షన్ కోసం అయ్యే ఖర్చులు నరేంద్ర వర్మ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి , టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మందపాటి ఆంధ్రేయ పాల్గొన్నారు

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి

ప్రజాశక్తి - చీరాల : చీరాల పట్టణ పరిధిలోని 31,32, 33 వార్డులలో ప్రభుత్వ భూములు అన్యాకాంత్రం అవుతున్నాయని, వాటిని కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్యకు 31వ వార్డు కౌన్సిలర్ సత్యానందం వినతిపత్రం సోమవారం అందజేశారు.

సమస్యల పరిష్కార వేదికలో 9 అర్జీలు

ప్రజాశక్తి -రేపల్లె : ఆర్‌డిఒ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రామలక్ష్మి అర్జీదారుల నుంచి ఆర్జీలు స్వీకరించారు. మొత్తం 9 అర్జీలు వచ్చాయి. కొన్ని అర్జీలను అక్కడిక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను పరిష్కారం కోసం సంబంధింత అధికారులకు పంపినట్లు ఆర్‌డిఒ ఎన్.రామలక్ష్మి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యతో ఇక్కట్లు

ప్రజాశక్తి- కొల్లూరు

ఇళ్ల స్థలాల సమస్యలతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నట్లు మండల పరిధిలోని తిప్పలకట్ట ,పోతర్లంక ,తురకపాలెం ,కష్ణ నగర్ వాసులు వాపోయారు. ప్రజా చైతన్య యాత్ర బృందం మండల పరిధిలోని కిష్కిందపాలెం, తురకపాలెం,తో కలవాని పాలెం, పోతర్లంక ఎస్‌సి కాలనీలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు సిపిఎం బృందం ఎదుట తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తిప్పలకట్ట ,పోతర్లంక ,తురకపాలెం ,కష్ణ నగర్ వాసులకు తోకలవానిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో జగన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. నాలుగు గ్రామాలకు కలిపి ఒకే చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. జీవో నెంబర్ 2 ప్రకారం దళిత వాడ శ్మశాన వాటికలకు రెండు ఎకరాలు స్థలం కేటాయిం చాలన్నారు. పోతర్లంక దళిత వాడకు శ్మశాన వాటికకు వెళ్లేందుకు కూడా రహదారి లేదని తెలిపారు. ఎస్‌సి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేదని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కిస్కిందపాలెంలో బస్‌షెల్టర్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి. కష్ణమోహన్, కొల్లూరు మండల కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య, కొల్లూరు మండల కమిటీ సభ్యులు పంతగాని నాగమల్లేశ్వరరావు ,బొనిగల సుబ్బారావు, పి. మరియారావు ,ఎ.రమేష్ , ఎన్.దాస్ పాల్గొన్నారు.

బాపట్ల : మండల పరిధిలోని వెదుళ్లపల్లి గ్రామపంచాయతీలో తాగునీటి సరఫరా సక్రమంగా లేనందున నీటి పన్ను వసూళ్లను నిలిపివేస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి మాణిక్యమ్మ తెలిపినట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. కొండయ్య తెలిపారు. వెదుళ్లపల్లి గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ప్రజా చైతన్య యాత్ర బృందం ఎదుట ఏకరువు పెట్టారు. మంచినీరు సరఫరా చేయకుండానే పన్ను వేస్తున్నట్లు తెలిపారు. దోమల సమస్యలతో అల్లాడుతున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్యదర్శి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుమల, సుభాషిణి, దేవళ్ళ రమణయ్య, శ్రీనివాసరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.



కొల్లూరులో స్థానికులతో మాట్లాడుతున్న నాయకులు

మహిళలను లక్షాధికారిని చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. కర్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామసభ నిర్వమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా (పిఎం అజయ్,) ప్రధానమంత్రి అనుచిత జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా రూ.5 లక్షల విలువైన జీవనోపాధి సబ్సిడీ రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీ షెడ్యూల్ కాస్ట్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ప్రధానమంత్రి అనుచిత జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా 100 రోజుల ప్రణాళికలో భాగంగా వెనుకబడిన మహిళా సంఘాల్లోని ఎస్‌సి కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరిచి కుటుంబ ఆదాయం నెలకు రూ 10,000 వచ్చేలా విధంగా ప్రోత్సహించి ప్రతి మహిళా లక్షాధికారిని చేయడమే ప్రభుత్వాలు ధ్యేయమన్నారు. ఈ కార్యక్ర మంలో జడ్‌పిటిసి పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచి నక్కా లలితకుమారి, ఉప సర్పంచి పఠాన్ అహ్మద్ బాషా, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి, టిడిపి గ్రామ అధ్యక్షుడు షేక్ బాజీ, రామరాజు, చిలకల సురేంద్ర, ,ఏపూరి భూపతిరావు, ఎపిఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

'సరస్వతి' యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- దళితుల భూమి ఆక్రమించారు..
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దళితుల భూమి ఆక్రమించిన శ్రీ సరస్వతి విద్యాసంస్థల యాజమాన్యంను అరెస్ట్ చేయాలని పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం ఎదుట పలు ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో చెరువుకొమ్ముపాలెంకు చెందిన తాటిపర్తి వెంకటస్వామి తండ్రి వెంకయ్యకు సర్వేనెంబర్ 83/1లో 1992లో డీకే పట్టా ఇచ్చిన య.0-40 సెంట్లు భూమిపై సరస్వతి సంస్థల యాజమాన్యం కన్నేసిందని వారు ఆరోపించారు. 1996లో వెంకయ్య మరణించగా ఆయనను ఆ స్థలంలోనే సమాధి చేసినట్లు పేర్కొన్నారు. వారి స్థలం పక్కన వున్న ఏకె బిఇడి కళాశాల స్థలం కొనుగోలు చేసిన సరస్వతి విద్యాసంస్థల యాజమాన్యం వెంకటస్వామికి చెందిన స్థలం కబ్జా చేసేందుకు ఫోర్జరీ పత్రాలు సష్టించారని ఆరోపించారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టలేదని విమర్శించారు. తక్షణమే విద్యాసంస్థల ఛైర్మన్ ఎవి.రమణారెడ్డి, వారి తనయులు గణేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డిను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకులు దాసరి సుందరం, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, ఎరసం కన్వీనర్ పిన్నిక శ్రీనివాస్ ,బీఎస్పీ నాయకులు టి వెంకటస్వామి తదితరులు మాట్లాడారు కార్యక్రమంలో సిపిఎంఎల్, ఐఎల్‌పి, బిఎస్‌పి రాజకీయ పార్టీలు, ఓపిడిఆర్ వంటి సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో తల్లులు పాలిచ్చే గది ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన చిన్న బిడ్డలకు తల్లులు పాలిచ్చే గదిని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి సోమవారం ప్రారంభించారు. ఏదైనా పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే మహిళలకు ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. మహిళలు పని ప్రదేశాలలో చిన్న బిడ్డలకు తల్లులు పాలిచ్చు గది తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, ఇతర పని ప్రాంతాలలోనూ ఇలాంటి గదులు ఏర్పాటు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.



తల్లులు పాలిచ్చే గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్

కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడి డి.రాధా మాధవి, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, సిడిపివోలు, డిసిపిఓ పురుషోత్తం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహారం నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మీకోసం కార్యక్రమంలో అర్జీదారులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు పరిశీలించారు. ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు గత సోమవారం నుండి భోజన సదుపాయాన్ని అందిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం డిఆర్‌ఒ స్వయంగా అర్జీదారులకు అన్నం వడ్డించారు. తరువాత వారితో కలిసి భోజనం చేసి.. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (కంభం యూనిట్) వెంకట శివరామిరెడ్డి, పిజిఆర్‌ఎస్ ఆడిట్ సూపరింటెండెంట్ మధుసూదన రావు పాల్గొన్నారు.



భోజనం రుచి చూస్తున్న డిఆర్‌ఒ

'చలో ఢిల్లీ'లో పాల్గొన్న ప్రకాశం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రవాణారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఛలో డిల్లీ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నుండి పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు గంటెనపల్లి శ్రీనివాసులు, యం.అయ్యపరెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జున, హరిబాబు, ఫీరావళి, విజయలక్ష్మి, అల్లడి సుబ్బారావు తదితరులు నాయకత్వం వహించారు.



ప్రకాశం జిల్లా నాయకులు

చిన్నగొల్లపాలెంలో సిఎం చంద్రబాబు పర్యటన

1న 'పేదల సేవలో పింఛన్ పంపిణీ': కలెక్టర్



కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఏప్రిల్ ఒకటిన 'పేదల సేవలో పింఛన్ పంపిణీ' కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన గంజాం మండలం చిన్న గొల్ల పాలెం గ్రామానికి రానున్నారని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీన సీఎం పర్యటన ఖరారు నేపథ్యంలో జిల్లా అధికారులతో సోమవారం స్థానిక పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన జయప్రదం చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. పర్చూరు నియోజకవర్గం పరిధిలోని చిన్నగంజాం మండలం, పెదగంజాం రెవిన్యూ గ్రామం చిన్న గొల్లపాలెం గ్రామాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శిస్తారని చెప్పారు. తొలుత వద్దులు, ఒంటరి మహిళ, దివ్యాంగులైన లబ్ధిదారులతో మాట్లాడి, వారికి పింఛన్ పంపిణీ చేస్తారు. 45 నిమిషాల పాటు పింఛన్ లబ్ధిదారులతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి గడుపుతారని కలెక్టర్ చెప్పారు. తదుపరి ఏర్పాటుచేసే ప్రజావేదిక ద్వారా ప్రజలనుద్దేశించి సభలో సీఎం ప్రసంగిస్తారన్నారు. సభ పూర్తి కాగానే ఒక గంట పాటు పార్టీ కార్యకర్తలతో సీఎం సమావేశం అవుతారన్నారు. తదుపరి జిల్లా అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. మొత్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన చిన గంజాం మండలంలో నాలుగు గంటల పాటు ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో కార్యక్రమం జయప్రదం అయ్యేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే చిన్న గొల్లపాలెం గ్రామాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్, ఆర్‌డిఓ, డిఆర్‌డిఏ పీడీ, డ్వామా పీడీ మరికొంతమంది అధికారులు పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. హెలీప్యాడ్ ప్రాంతం, పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారుల నివాస ప్రాంతం, సభా వేదిక, కార్యకర్తల సమావేశం, అధికారుల సమావేశ వేదికలను పరిశీలించాలన్నారు. తనిఖీ అనంతరం ఆ గ్రామంలో సామాజిక వనరులు, అవసరాలు, మౌలిక సదుపాయాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ ద్వారా తక్షణమే చేపట్టే అంశాలపై ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల అమలు తీరుపై సంక్షిప్త సమాచారంతో నివేదిక సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్ డి ఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.



గాంధీ ప్రతిమలను అందజేస్తున్న దృశ్యం

జిల్లాలో 27 టీబీ రహిత గ్రామ పంచాయతీలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రపంచ క్షయ దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో భాగంగా జిల్లాలో 27 టీబి రహిత గ్రామ పంచాయతీలుగా గుర్తించి వాటికి సిల్వర్, బ్రాంజ్ గాంధీ గారి విగ్రహాలను డిపివోకి అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అరుణమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా

శాశ్వత పరిష్కారం చూపాలి..

ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 48 మంది అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పేర్నమిట్ట అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- చెరువును సమ్మర్ స్టోరేజీగా మార్చాలి
- రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలి..
- కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పేర్నమిట్టను ఒంగోలు కార్పొరేషన్‌లో విలీనం చేసి 13 ఏళ్లు అవుతున్నప్పటికీ పాలకులు అభివద్ధి మరిచారని, పేర్నమిట్ట అభివద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుండి 17 వరకు చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో ప్రజలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని సోమవారం నాడు ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు అన్న వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, నివాస స్థలాలు వంటి పలు సమస్యలు తాము చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు వెలిబుచ్చినట్లు గుర్తు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి పేర్నమిట్టలో ఉన్న 193 ఎకరాల చెరువుని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చి మంచినీటి సమస్యను పరిష్కరించవచ్చని సూచించారు. పేర్నమిట్ట శివారు ప్రాంతంలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు కేటాయించి, కాలనీలకు పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు మాట్లాడుతూ అరుణోదయ కాలనీ చివర గత 25 సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకొని పేదలు నివసిస్తున్నారని, ఇళ్లు ఖాళీ చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. శ్రామిక నగర్‌లో మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మరుగుదొడ్లు కట్టించాలని కోరారు. పేర్నమిట్టలో ఉన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, మురుగునీరు పోతురాజు కాలువకు కలిపే విధంగా కాలువ నిర్మించాలని కోరారు. ముస్లిములకు కేటాయించిన స్మశానానికి వెళ్లే మార్గంలో చిల్ల చెట్లు తొలగించి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, షేక్ కాలేషా, కోడూరి రామకష్ణారెడ్డి, తుళ్లూరు సుబ్బారావు, ఉంగరాల రామకష్ణ, బంకా పద్మ, జూపూడి వీరనారాయణ, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ ఇంజనీర్ చంద్రయ్యకు, మేయర్ గంగాడ సుజాతకు సమస్యలతో కూడిన అర్జీలు అందజేశారు.



ఎంఇ చంద్రయ్యకు అర్జీ ఇస్తున్న సిపిఎం నేతలు